క్లుప్తంగా

ముస్లిం విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సర్పంచ్ మొహిద్దీన్

మామిడికుదురు: హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. మామిడికుదురులో ఆదివారం జరిగిన సమావేశంలో అసోసియేషన్ ద్వారా 20 మందికి మెమెంటోలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. 70 మందికి నోటు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లు, తదితర వస్తువులను అందజేశారు. సభలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రిటైర్డ్ డీఈఓ గులామ్ మెహదీ 1972లో అసోసియేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా ప్రతిభావంతులైన పేద ముస్లిం విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేట డీఎస్పీగా గోవిందరావు



వై.గోవిందరావు

కొత్తపేట: స్థానిక డీఎస్పీగా వై.గోవిందరావు నియమితులయ్యారు. గతంలో డీఎస్పీగా పనిచేసిన కేవీ రమణ నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి నుంచి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఇంతవరకూ ఇన్‌చార్జ్‌గా అమలాపురం జిల్లా దిశ (మహిళా పోలీస్) విభాగం డీఎస్పీగా పని చేస్తున్న వై గోవిందరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఇన్‌చార్జ్ గోవిందరావునే కొత్తపేట ఫుల్ చార్జ్ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏలూరు రేంజ్ ఐజీ



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఏలూరు రేంజ్ ఐజీ గోరంట్ల వెంకటగిరి అశోక్‌కుమార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామికి విశేష పూజలు జరిపారు. ఆయనను ఆలయ వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి ఆలయ చరిత్ర వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

మామిడికుదురు: విద్యుత్ తీగలు తగిలి గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ దగ్ధమైంది. బి.దొడ్డవరంలోని బొలిశెట్టివారిపాలెంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. ద్రాక్షారామ నుంచి పెదపట్నంలంకకు గడ్డి లోడును తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌కు కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తాకడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మొత్తం గడ్డిని చుట్టుముట్టడంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో ట్రాక్టర్‌పై ఉన్న డ్రైవర్‌తో పాటు మరో నలుగురు సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. స్థానికులు బకెట్లు, బిందెలతో నీళ్లు తీసుకు వచ్చి మంటల్ని అదుపు చేశారు. రాజోలు అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. సుమారు రూ.30 వేల నష్టం జరిగిందన్నారు.

దశమికి పందిరి రాట ముహూర్తం

అంబాజీపేట: స్థానిక విజయ కనకదుర్గ భక్తాంజనేయ స్వామి వారి గుడి వద్ద విజయదశమి వేడుకలను పురస్కరించుకుని శర్వనవరాత్రులకు సంబంధించి ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేష్ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే నెల 3 నుంచి అమ్మవారి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామప్రదక్షిణతో లోకహితం

అంబాజీపేట: ఎక్కడైతే వేదాలు గౌరవింపబడతాయో, నిత్యం వేదపఠనం ఎక్కడ జరుగుతుందో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందని టీటీడీ వేద పండితులు వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనాపాఠి, కాశీపతి ఘనాపాఠీ అన్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట సత్యసాయినగర్‌లో ఉన్న బాలగణపతి మందిరం వద్ద తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేద ప్రవచనాన్ని ఆదివారం రాత్రి గావించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ ఘనాపాఠీ, కాశీపతి ఘనాపాఠి, ఫణి ఘనాపాఠి, లక్ష్మణకుమార్ శర్మ, రవితేజ ఘనాపాఠీలు వేద పఠనం చేశారు.

పోషకాలతోనే ఆరోగ్య జీవనం

- జనం చూపు.. బలవర్ధక ఆహారం వైపు
- అందరూ పాటిస్తే ఆరోగ్య సమాజం
- కొనసాగుతున్న జాతీయ పోషకాహార మాసోత్సవాలు



పోషకాలున్న చిరు ధాన్యాలు, పప్పులు

కొత్తపేట: జీవించినంత కాలం సంపూర్ణ ఆరోగ్యంగా గడపాలి.. అందుకు మనం నిత్యం తీసుకునే ఆహారంలో పోషకాలు ఉండాలి. దీనిని ప్రతీ ఒక్కరూ గుర్తిస్తే ప్రస్తుతం వివిధ అనారోగ్య రుగ్మతల సమాజం సంపూర్ణ ఆరోగ్య సమాజంగా మారుతుంది. ఈ విషయాన్ని ఇటీవల కాలంలో చాలా మంది గుర్తించారు. పోషకాహారం వైపు దృష్టి సారిస్తున్నారు. ఆహారం తీసుకునే విషయంలో కోవిడ్‌కు ముందు కోవిడ్‌కు తరువాత అన్నట్లు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. మనం ఏది తిన్నా అందులో నాలుగు పోషకాలుండాలన్న భావన ప్రజల్లో బాగా పెరిగింది. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ, కుటుంబ ఆరోగ్య శాఖల ద్వారా సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జాతీయ పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తుంది.

తగ్గిన విచ్చలవిడి ఆహారం

ఇదివరకటి లాగా బయటకు వెళ్లినప్పుడు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా చిరుతిండ్లు తినే పరిస్థితి కొంత తగ్గింది. నిల్వచేసిన ఫుడ్ తిని అనారోగ్యం కొని తెచ్చుకునే కంటే, అప్పటికప్పుడు ఇంట్లో తయారుచేసుకుని తింటే మేలని భావిస్తున్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రస్తుత మార్కెట్‌లో కిరాణా దుకాణాలు, పెద్ద, చిన్న మార్టులు, సూపర్‌మార్కెట్లు నిత్యావసర కిట్లు విక్రయిస్తున్నాయి. పోషక విలువలు ఉన్న బియ్యం ముఖ్యంగా కొర్రలు, బ్రౌన్ రైస్, సామలు, రాగులు, చోళ్లు వంటి చిరు ధాన్యాలు విక్రయిస్తున్నారు. చిరుతిళ్లలో భాగంగా ఆరగించడానికి బాదం, జీడిపప్పు, కిస్మిస్, వేరుసెనగ గుళ్లు, పిస్తా వంటి వాటిని, గసకసాలు, నువ్వు పప్పుతో తయారుచేసిన చిరుతిళ్లను విక్రయిస్తున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు పోషకాలను వెతికి మరీ పట్టుకుంటున్నారు.

తగ్గించిన స్వీట్స్, కొవ్వు పదార్థాలు..

ఒకప్పుడు ఇంటికి స్వీట్ ప్యాకెట్ తీసుకొస్తే మరుసటి రోజు ఒక్కటి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ ప్యాకెట్‌లో స్వీట్స్ కనీసం వారం రోజుల పాటు అలాగే ఉంటున్నాయి. అలా జనానికి స్వీట్స్‌పై మక్కువ తగ్గిపోయింది. ఒకవైపు సుగర్ రోగులు పెరిగిపోవడం, మరో వైపు స్వీట్స్ ఎక్కువగా తింటే భవిష్యత్‌లో సుగర్ వస్తుందేమోనన్న భయంతో వాటికి దూరంగా ఉంటున్నారు.

సంప్రదాయ చిరుతిళ్ల వైపు చూపు

మన అమ్మమ్మ, నాన్నమ్మల కాలం నాటి వంటకాల వైపు జనం మళ్లారు. ఆ కాలంలో సాయంత్రం పాఠశాల నుంచి రాగానే డబ్బాల్లో నుంచి జంతికలు, మురుకులు, సున్నుండలు, కజ్జికాయలు, అరిసెలు వంటి పిండివంటలు తీసి ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఇంట్లో వాటిని తయారు చేసే సమయం లేదు. మనుషులు లేరు. ఉపాధి, ఉద్యోగాల పేరిట యాంత్రిక జీవనం అయిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అక్కడక్కడా సంప్రదాయ పిండి వంటల దుకాణాలు వెలుస్తున్నాయి.

పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి



పోషకాహార లోపంతో పిల్లలకు తరచుగా ఇన్‌ఫెక్షన్‌లు సోకుతుంటాయి. వయసుకు తగ్గ బరువు ఉండకపోవడం లేదా అధిక బరువు ఉండటం, ఐరన్ లోపం వల్ల రక్తహీనత మొదలైన సమస్యలు అధికమవుతున్నాయి. వీటిని అధిగమించాలంటే ఆకుకూరలు, పండ్లు వంటి ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లలకు సక్రమంగా అరిగే మెత్తని ఆహారాన్ని తినిపించాలి. అయితే సమతుల ఆహారాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి.

– ఎం.శ్రీధర్‌నాయుడు, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, కొత్తపేట

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాహార సమస్య కారణంగా మహిళలకు 30 ఏళ్లకే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వయసు ప్రకారం పోషకాలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చు. నోటికి రుచిగా ఉందని అతిగా తింటే దాని వల్ల శరీరానికి కేలరీలు వస్తాయే గాని పోషకాలు అందవు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు వైద్యుల సూచనల మేరకు ఆహార నియమాలు పాటించాలి. తద్వారా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా పెరుగుతారు.

– వి.ప్రదీప్తికరుణ, గైనకాలజిస్టు, కొత్తపేట

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత పోషకాహార మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. వైద్యులు, పోషకాహార నిపుణుల సూచన మేరకు పోషకాహారం లేకపోతే శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోలేదన్న విషయాలను క్లస్టర్ సమావేశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చైతన్యవంతులను చేస్తున్నాం.

– పి.శారద, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, కొత్తపేట

వైభవంగా గణపతికి పూజలు

- భారీ అన్నసమారాధనలు
- లడ్డూలకు జోరుగా వేలం పాటలు



ఆదుర్రు శివారు మోరిపాలంలో విఘ్నేశ్వరునికి సమర్పించిన ప్రసాదాలు



రాజోలులో లక్ష గరిక పూజ చేస్తున్న అర్చకులు



వానపల్లిలో లోవకృష్ణకు లడ్డూ అందజేస్తున్న కమిటీ సభ్యుడు



పెదపట్నంలంకలో వేలంలో దక్కించుకున్న లడ్డూతో భక్తులు



సత్యసాయి నగర్‌లో ఎంపీపీ, సర్పంచులను సన్మానించిన కమిటీ సభ్యులు

మామిడికుదురు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదుర్రు గ్రామ శివారు మోరిపాలంలో ఎనిమిదో రోజు శనివారం రాత్రి విఘ్నేశ్వరునికి 200 రకాల స్వీట్లతో మహా ప్రసాదాలను నివేదించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వీట్లతో మహా నివేదన సమర్పించారు. వేదనబట్ల రామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండ జ్యోతిర్లింగార్చన అత్యంత వైభవంగా జరిగింది. పలువురు భక్త దంపతులు ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలో కర్తలుగా పాల్గొన్నారు. ప్రసాదాల మహా నివేదన, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామి వారిని దర్శించుకుని, ప్రసాదాలు స్వీకరించారు. గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

భారీ అన్న సమారాధన

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. గణపతి నవరాత్రుల ముగింపు రోజు సందర్భంగా స్థానిక చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ సమీపంలో నెలకొల్పిన ఈ మండపంలో ఆలయ కమిటీ సుమారు ఐదు వేల మందికి భారీ అన్నదానం చేపట్టింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ అన్నసమారాధనను స్వీకరించారు. ఈ అన్న సమారాధనలో గ్రామానికి చెందిన హరే శ్రీనివాస మహిళ భక్త బృంద సభ్యులు సహాయ సహకారాలను అందించారు.

ఘనంగా గణేశుని నిమజ్జనాలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, అయినవిల్లి, శానపల్లిలంక, ఎస్.మూలపాలెం తదితర గ్రామాల్లో గణేశుని నిమజ్జనాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. డీజేలు, సినీ సంగీతాలకు యువత కేరింతలు కొడుతూ డ్యాన్సులు చేశారు. గణేశుని ప్రతిమలు సమీప పంటకాల్లో నిమజ్జనం చేశారు. గణేశుని లడ్డూలకు వేలం నిర్వహించారు. భారీ అన్నదానాలు నిర్వహించారు.

రూ.15,300 పలికిన గణపతి లడ్డూ పాట

కొత్తపేట: మండలంలోని వానపల్లి గణేశ్ సెంటర్ బాలగణపతి ఆలయం నవరాత్ర ఉత్సవ పందిరి లడ్డూ పాట రూ.15,300 వరకూ వెళ్లింది. గణపతి నవరాత్రులు ముగుస్తున్న సందర్భంగా శనివారం రాత్రి ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గనిశెట్టి లోవకృష్ణ అత్యధికంగా రూ.15,300 కు పాడుకుని లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించి, లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు తోరాటి లక్ష్మణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష గరిక పూజ

రాజోలు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం రాజోలు కంటి ఆస్పత్రి వీధిలో గాయత్రి యూత్ ఆధ్వర్యంలో లక్ష గరిక పూజను ఘనంగా నిర్వహించారు. కాశీభొట్ల దీక్షితులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో న్యాయవాది సత్తిరాజు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వేదపండితులు మంత్రోచ్చారణతో జరిగిన గరిక పూజను భక్తులు తిలకించారు. మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గరిక, పుష్పాలతో అలంకరించారు. న్యాయవాది సత్తిరాజు స్వామి, డాక్టర్ సత్తిరాజు సూర్యనారాయణ, కాసు శ్రీనివాస్, ఈవలి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు కిలోల లడ్డూ రూ.18 వేలు

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా పెదపట్నంలంక ధనమ్మపేటలో అగ్నికుల క్షత్రియ సంఘం ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. వినాయకుని చేతిలో లడ్డూను వేలం వేయగా భక్తుడు మల్లాడి లక్ష్మీనారాయణ అయిదు కిలోల లడ్డూను రూ.18 వేలకు కైవసం చేసుకున్నారు. అయిదు కిలోల రెండో లడ్డూను మల్లాడి రంగారావు రూ.12 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంతో పాటు మామిడికుదురు బుల్లోడు వంతెన వద్ద ఏర్పాటు చేసిన వినాయ మండపాల వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి. ఆయా మండపాల వద్ద వేలాది మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

అంబాజీపేట: స్థానిక పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న సత్యసాయి నగర్‌లో వేంచేసిన బాలగణపతి మందిర తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సుబ్బారావు దంపతులను ఘనంగా సత్కరించారు.

నేడు నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం పుష్కర ఘాట్ వద్ద సోమవారం వినాయక నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వనదుర్గా లైటింగ్ ప్రొప్రయిటర్ రేకపల్లి నరసింహారావు, స్థానిక రైతు, వర్తక సంఘం ఆదివారం తెలిపింది. ఏటా మాదిరిగానే కొత్త కాజ్ వేకు దగ్గర పుష్కరఘాట్‌లో మధ్యాహ్నం నుంచి నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు తాగునీరు, ప్రసాదాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. వీటితో పాటు ఘాట్ వద్ద ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేసినట్టు ఆయన అన్నారు.

వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి హెఎస్‌జే వెంకట జ్యోతిర్మయి దంపతులు, ఏలూరు రేంజ్ ఐజీ బి.అశోక్‌కుమార్ దంపతులు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆలయంలోకి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఆక్వా రైతులకు ముందస్తు మైక్ ప్రకటన

సఖినేటిపల్లి: అంతర్వేది సముద్ర తీరంలో ఆక్వా సాగు చేస్తున్న రైతులకు జిల్లా మత్స్యశాఖ అధికారి పేరిట ఆదివారం పబ్లిక్ మైక్ ప్రకటన ఇచ్చింది. అంతర్వేది దేవస్థానం పంచాయతీ పరిధిలోని ఆక్వా రైతులకు ప్రత్యేకించి ఈ ప్రకటన జారీ చేసింది. చెన్నైకి చెందిన ఎన్జీటీ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, అంతర్వేది దేవస్థానంలో సముద్రతీరం నుంచి 200 మీటర్ల పరిధిలోని అన్ని ఆక్వా చెరువులను తొలగించనున్నట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది. 200 నుంచి 500 మీటర్ల పరిధిలోని అనధికార ఆక్వా చెరువులనూ తొలగిస్తామని పేర్కొంది. సదరు పంచాయతీ పరిధిలోని ఆక్వా రైతులు తమ, తమ విలువైన సామగ్రిని భద్రపరుచుకోవాలని ఆ ప్రకటనలో మత్స్యశాఖ సూచించింది.

రేపటి నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

సఖినేటిపల్లి: ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ మండల వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీపీ సత్యనారాయణ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేందుకు ప్రభుత్వ ఆదేశాలపై కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. సమాజం మొత్తాన్ని భాగస్వాములను చేసేలా పక్షం రోజుల పాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో గోదావరి వరద ముంపుబారిన పడిన ఇందిరమ్మ కాలనీలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఆదివారం ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కాలనీలో మొత్తం బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య చర్యలు చేపట్టారు. దోమల నిర్మూలనకు ఎబేట్ మందు స్ప్రేయింగ్ చేయిస్తామని చెప్పారు. సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పట్టిలింగం పనులను పర్యవేక్షించారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

అయినవిల్లి: వరద ప్రభావిత గ్రామాల్లో తక్షణం పారిశుధ్య చర్యలు చేపట్టాలని డీపీఓ డి.రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని వరద ప్రభావిత గ్రామాల్లో డీపీఓ ఆదివారం పర్యటించారు. కొండుకుదురులోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్, ఎంపీటీసీ గుర్రాల రమాదేవి తదితరులు ఉన్నారు.

రహదారులను ఆధునీకరించాలి



గంగలకుర్రులో రహదారుల అభివృద్ధిపై మంత్రి సుభాష్‌కు వివరిస్తున్న సర్పంచులు

అంబాజీపేట: స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుంచి బోడసకుర్రు వంతెన వరకు రహదారిని అభివృద్ధి చేసిన విధంగా గున్నేపల్లి, సాకుర్రు, ఇందుపల్లి గ్రామాల మీదుగా రహదారిని ఆధునీకరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మూడు గ్రామాల సర్పంచులు కోరారు. గంగలకుర్రులో జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద రహదారుల అభివృద్ధిపై గున్నేపల్లి సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవి, ఇందుపల్లి సర్పంచ్ చొల్లంగి శివాలినిలు మంత్రి సుభాష్‌ను కలసి రహదారి ఆధునీకరణ, ఆవశ్యకతను ఆదివారం వివరించారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి, జాతీయ రహదారుల అధికారులతో జయంతి సుబ్రహ్మణ్యంతో కలసి నూతన రహదారుల నిర్మాణంపై చర్చిస్తామన్నారు. సమావేశంలో స్థానిక సర్పంచి కాండ్రేగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం మంత్రి గంగకులర్రు శివారు గుంట మామిడి తోటలోనున్న లక్ష్మీగణపతి ఆలయాన్ని, చవితి పందిరిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటమామిడి తోట ప్రజలు మంత్రికి ధాన్యపు కుచ్చును బహూకరించారు.

విధులు చేపట్టిన పారిశుధ్య కార్మికులు

కొత్తపేట: వివిధ డిమాండ్లతో గత వారం రోజులుగా సమ్మె బాట పట్టిన కొత్తపేట పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆదివారం తిరిగి విధులు చేపట్టారు. గత కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు పంచాయతీ జీతాలు చెల్లించకపోవడంతో వారు విధులు బహిష్కరించారు. దాంతో ఈ నెల 11న కాంట్రాక్ట్ కార్మికులకు, 12న పర్మినెంట్ కార్మికులకు జీతాలు చెల్లించారు. అయితే మండలంలో ఇతర గ్రామాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారిని తొలగించి, స్థానిక కార్మికులను తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం తీర్మానించింది. దానిని కార్మికులు వ్యతిరేకిస్తూ విధులకు హాజరు కాలేదు. దాంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి, పారిశుధ్య సమస్య, అనారోగ్య వాతావరణం ఏర్పడటంతో ఆదివారం ఉదయం ఇతర గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులను రప్పించి, వారితో పాటు పంచాయతీ పాలకవర్గం, నాయకులు పారిశుధ్య పనులకు సిద్ధమయ్యారు. వారిని ఈ పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. దాంతో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కార్యదర్శి వీవీ రాముస్, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు విళ్ల మారుతీ ప్రసాద్ తదితరులు కార్మికులతో చర్చలు జరిపారు. తొలగిస్తామన్న వారిని కూడా విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు తిరిగి విధుల్లో చేరారు.

తగ్గుముఖం పట్టిన వరద



జొన్నాడ వద్ద నిలకడగా గౌతమీ గోదావరి

ఆలమూరు: గౌతమీ గోదావరికి సంభవించిన వరదల వల్ల గత వారం రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లంక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ప్రాంతాల్లో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఉద్యాన, వాణిజ్య, కూరగాయ తోటల్లో వరద నీరు క్రమేపీ తగ్గుముఖం పట్టింది. అధికారులు సత్వరమే పంట నష్టం అంచనా వేసి పరిహారాన్ని అందజేయాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. లంక భూముల్లో చేతికి అంది వచ్చిన పంటలు వరదల వల్ల పాడైపోయిన నేపథ్యంలో ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరద నుంచి తేరుకున్న గ్రామాలు

అయినవిల్లి: వరద నుంచి లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని కాలనీ ఇప్పుడిప్పుడే ముంపునీటి నుంచి బయటపడ్డాయి. గ్రామాల్లో రహదారులు వరదనీటితో దెబ్బతిన్నాయి. అక్కడక్కడా బురదలో దర్శనమిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామాల్లో బ్లీచింగ్, ఎబేట్, ఫాగింగ్ చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. పశువులకు వరస వరదలతో మేతల్లేక ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు చెబుతున్నారు.

తహసీల్దార్ భవన నిర్మాణం పూర్తయ్యేనా?



అంబాజీపేటలో అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ భవనం

అంబాజీపేట: అంసపూర్తిగా నిలిచియిన అంబాజీపేట తహసీల్దార్ భవన నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మిస్తారా లేక గాలికొదిలేస్తారో వేచి చూడాలని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. 2018 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.90 లక్షలతో తహసీల్దార్ భవన నిర్మాణానికి స్థానిక పశువుల మార్కెట్ వద్ద భూమి పూజ చేశారు. భవన నిర్మాణ పనులు సుమారు 50 శాతం పూర్తయినప్పటికీ మిగిలిన పనులు పూర్తి చేయకుండా అప్పటి ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారు. ఇచ్చిన నిధులు అరకొరగా మంజూరవడంతో కాంట్రాక్టర్ పని చేయకుండా చేతులెత్తేశారని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. లక్షలు వెచ్చించి నిర్మించిన తహసీల్దార్ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తున్న అధికారులెవరికీ చీమకుట్టినట్లు కూడా లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయం ఇరుకు గదుల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ భవనాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

శ్రీకృష్ణుడి లీలలు అర్థం కావు

అయినవిల్లి: భగవంతుడైన శ్రీకృష్ణుడి లీలలు ఒక పట్టాన ఎవరికీ అర్థం కావని, శుద్ధ భక్తుడికి మాత్రమే ఆయన లీలలు అవగతమవుతాయని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు ప్రభూ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభూ శ్రీకృష్ణుని లీలలను వివరించారు. శుద్ధ భక్తుడు అడుగుజాడల్లో నడిస్తే శ్రీకృష్ణుని తత్వం బోధపడుతోందన్నారు. ఆపదలో ఉన్న ఆయనను నమ్మిన, ఆయన స్మరణ, సేవలో ఉన్న భక్తుడ్ని ఎల్లప్పుడూ శ్రీకృష్ణుడ్ని కాపాడతారని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు శ్రీకృష్ణుని పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.